క్లుప్తంగా

కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం ఆర్థికసాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం 51మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించారు. తహసీల్దార్ రాజయ్య, మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, నాయకులు రామ్మూర్తి పాల్గొన్నారు.

దోమల నివారణపై స్పెషల్ డ్రైవ్



ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో దోమల నివారణపై శుక్రవారం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్ని డివిజన్లలో ఫ్రైడే–డ్రై డే కార్యక్రమం నిర్వహించగా, బల్దియా డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పర్యవేక్షించారు. పలు చోట్ల పర్యటించి పూల కుండీల్లో, కూలర్లలో, పాత టైర్లలో, డ్రమ్ముల్లో చాలాకాలంగా నిల్వ ఉన్న నీటిని పార బోయించారు. వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కిరణ్, కుమారస్వామి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, వార్డుఅధికారులు, శానిటరీ జవాన్లు, మెప్మాసిబ్బంది పాల్గొన్నారు.

జాంబవంత మహరాజ్ జయంతి

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలోని కమ్యూనిటీ భవనం వద్ద జాంబవంత మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జాంబవంత మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, సంపత్, మోదుంపెల్లి భూమయ్య, కొమురయ్య, వేణు, శ్రీకాంత్, అంజయ్య, రాజు పాల్గొన్నారు.

పేపర్ బ్యాగులను వినియోగించాలి



పేపర్ బ్యాగులతో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: ప్రతీఒక్కరు పర్యావరణ హితం కోసం పేపర్‌బ్యాగులను వినియోగించాలని గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ అన్నారు. 12న ప్రపంచ పేపర్‌బ్యాగ్ డే సందర్భంగా పాఠశాల విద్యార్థులు సంచులు తయారుచేసి ప్రదర్శించారు. పేపర్‌తో తయారు చేసిన సంచుల వినియోగంతో కలిగే ప్రయోజనాలు వివరిస్తూ పోస్టర్ ఆవిష్కరించి నాటకం ప్రదర్శించారు. కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాంకుల ద్వారా శుభ్రమైన నీటి సరఫరా

జ్యోతినగర్: నగరపాలక సంస్థ ద్వారా అందిస్తున్న మంచినీటిని శుభ్రపరిచి సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం హెలిప్యాడ్ సమీపంలోని నీటి ట్యాంకులో శుక్రవారం బ్లీచింగ్ పౌడర్ కలిపారు. అధికారులు రామన్, జమీల్, వాటర్ సప్లై ఇన్‌స్పెక్టర్ శశికుమార్, మధు పాల్గొన్నారు.

సిగాచి యాజమాన్యంపై హత్యానేరం నమోదు చేయాలి

గోదావరిఖని: పాషా మైలారంలోని సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై హత్యానేరం నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. ఆఫీస్ బేరర్స్ సమావేశం శుక్రవారం స్థానిక శ్రామికభవన్‌లో నిర్వహించారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ముద్రించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు వేల్పుల కుమారస్వామి, భిక్షపతి, కొమురయ్య, జ్యోతి, రామాచారి, అరవింద్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కమాన్‌పూర్: కరీంనగర్ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కమాన్‌పూర్ కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పెన్నులను ఎంఈవో ఇల్లందుల విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. విద్యార్థులకు బ్యాంకుల లావాదేవీలపై అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ సరోజన, అసిస్టెంట్ మేనేజర్ అనిలా, ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్, సిబ్బంది వికాస్, హారిక, సంతోష్, అబేదా, సర్వర్, ఉపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

మత్తులో బాల్యం

- గంజాయికి బానిసవుతున్న మైనర్లు
- పోలీసులు అవగాహన కల్పించినా మారని తీరు
- గంజాయి రవాణా అరికట్టాలని మండల ప్రజల వినతి



జేఎన్టీయూలో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా (ఫైల్)

రామగిరి: మండలంలోని విద్యార్థులు, యువత మత్తులో చిత్తవుతున్నారు. గంజాయి నింపిన సిగరెట్లు తాగుతూ మైకంలో తేలియాడుతున్నారు. మండల కేంద్రాలు, గ్రామ శివారులు అడ్డాలు చేసుకుని గంజాయి నింపిన సిగరెట్లు తాగుతున్నారు. కాలేజీ కుర్రాళ్లే కాదు.. స్కూల్ పిల్లలు సైతం ఈ మత్తుకు బానిస అవుతున్నారు. ముఖ్యంగా కొందరు మైనర్లు ఇన్‌స్టాగామ్‌లో గ్రూపుల్లో చాటింగ్ చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. మండలంలోని ఓ గ్రామంలో మైనర్లు తోటి మైనర్‌పై దాడి చేస్తూ సోషల్ మీడియాలో పెట్టిన వీడియోపై మండలంలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. అసలు పిల్లలు ఇంట్లో ఎలా ఉంటున్నారో కూడా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అవగాహన కల్పించినా ఆగని వైనం

మండలంలో మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించేందుకు పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో యాంటీడ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు. అయినా గంజాయి దందా కొనసాగుతోంది.

మత్తుకు బానిసవుతున్నారు..

ఆడుతూ.. పాడుతూ చదువుకునే విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు. గ్రామ శివారుల్లోని అడ్డాల దగ్గరికి వెళ్లి గంజాయి సేవిస్తున్నారు. గంజాయి మత్తులో దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

కట్టడి చేయగలిగేది తల్లిదండ్రులే..

పిల్లలు మత్తుకు బానిసలుగా మారుతున్నారంటే తల్లిదండ్రుల నిర్లక్ష్యమేనని పోలీసులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముందు తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలి, కుటుంబ వివాదాల ప్రభావం పిల్లలపై పడకుండా చూడాలి. పిల్లల స్నేహితులు ఎవరు? పాఠశాల, ఇంట్లో విద్యార్థి ప్రవర్తనలో మార్పును గమనిస్తే.. మత్తుకు బానిసయ్యే వారిని గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

గంజాయి రవాణా అరికట్టాలి



గంజాయి మత్తులో యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గంజాయి సేవించడంతో మత్తు దిగని పరిస్థితి. గంజాయి రవాణాను అరికట్టి మత్తుకు బానిసలవుతున్న యువతపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి భవిష్యత్‌ను కాపాడాలి.

– ఓడేటి చంద్రశేఖర్, ఎస్‌హెచ్‌ఆర్ రాష్ట్ర కార్యదర్శి

అవగాహన కల్పిస్తున్నాం



విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం. కొంత మంది విద్యార్థులు గంజాయికి అలవాటు పడినట్లుగా అనుమానాలున్నాయి. వారిని కట్టడి చేయడానికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాల, కళాశాలల వద్ద నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించాలి.

– బొల్లపల్లి రాజుగౌడ్, మంథని సీఐ

స్థానిక సమరానికి బీఆర్‌ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: బీఆర్‌ఎస్ శ్రేణులు స్థానిక సమరానికి సిద్ధం కావాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పిలుపునిచ్చారు. మంథనిలోని రాజగృహలో శుక్రవారం మున్సిపల్ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సమరంలో మంథని పట్టణంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

బెదిరింపులకు భయపడేది లేదు

మంథని నియోజకవర్గంలో బీసీ నినాదం ఎత్తుకున్న తమపై అణిచివేయాలనే ఆలోచనతో మంథని ఎమ్మెల్యే తమపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నారని, బెదిరింపులకు భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. రామగిరి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పూదరి సత్యనారాయణగౌడ్‌ను గురువారం రాత్రి అరెస్ట్ చేసి శుక్రవారం మంథని కోర్టులో హాజరుపర్చారు. కోర్టు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన పూదరితో కలిసి ఆయన మాట్లాడారు.

పండుగలను కలిపి జరుపుకునే సంస్కృతి మనది

రామగిరి: హిందువులు, ముస్లింలు వేరు వేరు అనే భావన ఎవరిలో ఉండొద్దని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. సెంటినరికాలనీలో ఎండీ జాఫర్ ఆధ్వర్యంలో పునరుద్ధరించబడిన జామా మసీదును శుక్రవారం ఆయన ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్, నాయకులు జక్కు రాకేశ్, మ్యాదరబోయిన కుమార్ యాదవ్, ఎండీ ముజీబ్ పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



గోరింటాకు చూపిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం మహిళలు శుక్రవారం గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు బాదం వాణి పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణ..

వాసవిమాత దేవాలయంలో శుక్రవారం గోరింటాకు వేడుకలను పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలందరూ మొదటగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారి పారువెల్ల సంతోశ్‌శర్మ–మాధవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ చకిలం మారుతి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, కోశాధికారి కొమురవెల్లి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ముఖ్య సలహాదారులు పల్లకిషన్, వైస్ ప్రెసిడెంట్ కొమురవెల్లి శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, జైశెట్టి రాము, రామిడి రవీందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• బ్యాంకు సేవలపై అవగాహన

ముత్తారం: విద్యార్థులు బ్యాంకు సేవింగ్స్, లావాదేవీలు, సేవలపై అవగాహన పెంచుకోవాలని ముత్తారం కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ విష్ణు భక్తుల ప్రసాద్ సూచించారు. మండలంఅడవి శ్రీరాంపూర్ జెడ్పీ పాఠశాలలో శుక్రవారం కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఓదెలు, డెవలపమెంట్ ఎగ్జిక్యూటివ్ దిలీప్, ఎఫ్ఎల్‌సీ మోహన్‌రావు పాల్గొన్నారు.

• బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

జూలపల్లి: మండలంలోని చీమలపేటలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. అమలు చేయలేని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ నాయకులు రవి, శ్రీనివాస్, స్వామి, రమేశ్, రాజేశం, నారాయణ, భాస్కర్, బుచ్చన్న, తిరుపతి పాల్గొన్నారు.

• సెల్‌ఫోన్ అప్పగింత

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన ఎలబోయిన కుమార్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శుక్రవారం కమాన్‌పూర్ ఎస్సై అందజేశారు. కుమార్ కొన్ని నెలల క్రితం రోడ్డుపై వెళ్తుండగా సెల్‌ఫోన్ ఎక్కడో పడిపోయింది. ఫోన్ పోయిందని సీఈఐఆర్ పోర్టల్‌లో కమాన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కమాన్‌పూర్ పోలీసులు ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను గుర్తించి కుమార్‌కు అందజేశారు.

• మహిళల్ని చైతన్యవంతం చేయడమే లక్ష్యం

సుల్తానాబాద్/ఎలిగేడు: ఇందిరమ్మ మహిళాశక్తి కార్యక్రమాల్లో భాగంగా మహిళలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలంగాణ సంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు తెలిపారు. పట్టణంలోని మార్కండేయకాలనీ, ఎలిగేడు మండల కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి సంబరాలలో భాగంగా శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం అవగాహన కల్పించింది. కళాకారులు గుండ్ల స్నేహలత, ఇల్లందుల మల్లేశ్‌గౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, వడకపురం రవి, సలేంద్ర రాజన్న, ఢిల్లీ వెంకటస్వామి, నారగోని సరిత, సాయిళ్ల శ్రీనివాస్, జక్కుల స్వప్న, కన్నూరి రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌కు చెందిన మామిడి రాజశేఖర్ (28) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. రాజశేఖర్ గతనెల 21న తన భార్య అనితతో గొడవపడి క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు ప్రాథమిక చికిత్స చేసి తదుపరి చికిత్స కోసం కరీంనగర్‌కు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుడికి భార్యతో పాటు ఏడునెలల వయసున్న బాబు ఉన్నాడు. మృతుడి తండ్రి మామిడి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• 'ఖని'లో కాంగ్రెస్ నేతల సంబరాలు

గోదావరిఖని: బీసీ వర్గాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు బొంతల రాజేశ్, గట్ల రమేశ్, పెండ్యాల మహేశ్, కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, శ్రీనివాస్, ముస్తఫా, ఎల్లయ్య, బాలరాజు, రాజేశ్, వేణు, నజీమొద్దీన్, ఓదెలు, శంకర్, సింహాచలం, సతీశ్, శ్రీనివాస్, ఓదెలు, గౌస్, సన్నీ, సతీశ్, దొంతుల కిరణ్, డేవిడ్, కిరణ్ పాల్గొన్నారు.

• సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

ధర్మారం: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, నాయకులు అంజయ్య, లావణ్య, గంగారెడ్డి, మల్లయ్య, లింగయ్య, రాజు, స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న తహసీల్దార్ వాసంతి

కమాన్‌పూర్: వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని తహసీల్దార్ వాసంతి కోరారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్లు మాధురి, రంజిత, సెక్షన్ ఆఫీసర్ అమీరొద్దిన్, కార్యదర్శి ప్రసాద్, ఎలువాక సతీశ్, రాసకొండ భీంరాజ్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మకు వెండి కిరీటం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని మినీ ట్యాంకుబండ్ సమీపంలోని కట్టమైసమ్మతల్లికి వెండి కిరీటాన్ని పెద్దపల్లికి చెందిన రంగు శ్రీనివాస్–కవిత దంపతులు శుక్రవారం అందించారు. ఆలయ పూజారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి వెండి కిరీట ధారణ చేశారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, గండు రంగయ్య, సంపత్, రామ్మూర్తి, జగదీశ్, రాజేశం, అజయ్, రవి, అశోక్, వెంకటేశం సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దబొంకూర్, పెద్దకల్వల, నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దపల్లి, రంగంపల్లిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. అలాగే గుండమ్మకట్ట సబ్‌స్టేషన్ పరిధిలోగల చందపల్లి, తిలక్‌నగర్, ప్రగతినగర్, శాంతినగర్, అమర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జగదీశ్ పేర్కొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: మండల కేంద్రంలో శనివారం ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కిషన్ తెలిపారు.


ఆర్జీ–1 ఐఎన్‌టీయూసీ పిట్ కమిటీ నియామకం



నియామక పత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: ఆర్జీ–1 ఐఎన్‌టీయూసీ జీఎం ఆఫీస్ పిట్ కమిటీని శుక్రవారం ప్రకటించారు. పిట్ సెక్రటరీగా జబ్బార్‌మియా, అసిస్టెంట్ పిట్ సెక్రటరీగా శేషుకుమార్‌ను నియమించారు. నాయకులు కచ్చకాయల సదానందనం, ధర్మపురి, వికాస్‌కుమార్‌యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, గంధ్ర దామోదర్, పోచయ్య, సంపత్, పరశురాం, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్‌తో ఒకరు మృతి



గుంటి రాయమల్లు

రామగుండం: 40ఏళ్ల క్రితం రామగుండం పట్టణ పరిధిలో సుమారు 90శాతం గృహ నిర్మాణాలు చేపట్టి ప్రతీ కుటుంబంతో ఆర్థికపరమైన అంశాలపై అన్ని విషయాల్లో సలహాలిస్తూ మమేకమయ్యేవాడు. కాలక్రమేణా ఆంధ్ర మేస్త్రీలు రావడం.. వయసు పైబడడంతో శేష జీవితం గడుపుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందాడు పట్టణంలోని భీమయ్యకాలనీకి చెందిన గుంటి రాయమల్లు(80). అతని రెండో కుమారుడు గుంటి దేవేందర్ మూడురోజుల క్రితం తీవ్ర ఆరోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరగా, కుమారుడి అస్వస్థతను చూసి జీర్ణించుకోలేక తీవ్ర మనస్థాపంతో రాయమల్లు ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబసభ్యులు గోదావరిఖని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఇంటికి తీసుకొచ్చిన మరుసటి రోజు అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్‌డెడ్ అయి మృతి చెందినట్లు డాక్టర్లు గుర్తించారు. పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా అస్వస్థతతో ఉన్న రెండో కుమారుడిని ఆస్పత్రి నుంచి తీసుకువచ్చిన తర్వాత అంత్యక్రియలు పూర్తి చేశారు.

ప్రతీ మహిళ శక్తిగా ఎదగాలి

కమాన్‌పూర్: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతీ మహిళ శక్తిగా ఎదగాలని ఎంపీడీవో లలిత అన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాజాత కళాకారులు మండల కేంద్రంలో శుక్రవారం కళాజాత మహిళా శక్తిపై కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం శైలజశాంతి, కళాకారులు కొండ్ర వెంకన్న గౌడ్, ఐదునూరి పద్మ, దయ నర్సింగ్, సుధాకర్, స్పందన, శ్వేత, రవి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

చిన్నారులకు సింగరేణి పర్యావరణ పాఠం



విద్యార్థులతో జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: స్థానిక ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు ఏరియా నర్సరీని సందర్శించగా సింగరేణి ఫారెస్ట్ అడ్వయిజరీ ఎస్సీ పర్గెన్, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ మొక్కల వివరాలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డీజీఎం బానోతు కర్ణ, స్కూల్ కరస్పాండెంట్ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు అసిస్టెంట్లకు ఈగ్రేడ్ పదోన్నతి కల్పించాలి

గోదావరిఖని: స్థానిక సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న వార్డు అసిస్టెంట్లకు ఈగ్రేడ్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌కు వచ్చిన సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌ను శుక్రవారం వార్డు అసిస్టెంట్‌లు కలిసి వినతిపత్రం అందించారు. కోల్ ఇండియాలో ఇచ్చిన విధంగా తమకు గ్రేడ్ ఈ ప్రమోషన్‌లు ఇవ్వాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీఎంఓ న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. వార్డు అసిస్టెంట్‌లు సంతోష్, అనిల్‌భాస్కర్, అఫ్సర్‌పాషా, విద్యాసాగర్, గోపీకృష్ణ, పోచంపల్లి శ్రీనివాస్, కుమారస్వామి, శ్రీకాంత్, అఖిల్, రామలక్ష్మి ఉన్నారు.

ఎన్టీపీసీ ప్రాజెక్టు డ్రైవర్లకు కుదిరిన వేతన ఒప్పందం



ఒప్పంద పత్రం అందుకుంటున్న చందర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో డ్రైవర్లుగా కొనసాగుతున్న వారికి కేంద్ర కార్మికశాఖ అధికారి కార్యాలయంలో వేతన ఒప్పందం కుదిరిందని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని కేంద్ర కార్మికశాఖ కార్యాలయంలో శుక్రవారం అసిస్టెంట్ లేబర్ కమిషన్ యూసఫ్ సమక్షంలో ఎన్టీపీసీ కాంట్రాక్టు డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కాంట్రాక్టర్లు, ఎన్టీపీసీ అధికారులు చర్చల్లో పాల్గొన్నారని తెలిపారు. చర్చల అనంతరం వేతన ఒప్పందం కుదిరిన పత్రాన్ని ఏఎల్‌సీ యూసఫ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఎన్టీపీసీ అధికారులు దీపక్ పాఠక్, ప్రవీణ్ కుమార్, కాంట్రాక్టర్లు, డ్రైవర్లు మధు, సాగర్, శ్రీనివాస్, గౌస్, గోవర్ధన్, ఓదెలు ఉన్నారు.

యూరియా ఉత్పత్తిలో 45శాతం రాష్ట్రానికే కేటాయించాలి

గోదావరిఖని: ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలో ఉత్పత్తి అవుతున్న యూరియాలో 45శాతం రాష్ట్రానికే కేటాయించాలని ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏకైక యూరియా ఉత్పత్తి పరిశ్రమ ఆర్ఎఫ్‌సీఎల్‌లో 11.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి అవుతుంటే, రాష్ట్రానికి కేవలం 4.68 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఇస్తున్నారన్నారు. మిగతా యూరియా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్‌లో లోకల్ కార్మికులను తగ్గించి బిహారీ కార్మికులను పెంచుతున్నారన్నారు. ఇందుకోసం బిహారీ హటావో లోకల్ బచావో ఉద్యమం చేస్తామని తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో అధికారుల అవినీతి పెరిగిందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎండీ అఫ్జల్, ఆడెపు రమేశ్, సతీశ్, ఆకుల అనిల్, రావుల సురేశ్, మేకల శ్రీనివాస్, శ్రావణ్, సతీశ్, పల్లె సాగర్, లచ్చన్న, కర్ణాకర్, కృష్ణనాయక్, వేముల సతీశ్ పాల్గొన్నారు.

ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు



పెద్దపల్లిరూరల్: రక్తదానం చేస్తున్న నాయకులు



కోల్‌సిటీ: రక్తదాతలతో కర్రె సంజీవరెడ్డి

పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ/సుల్తానాబాద్‌రూరల్/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్/కమాన్‌పూర్/జూలపల్లి/ఓదెల: జిల్లావ్యాప్తంగా మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కొండూరి జన్మదిన వేడుకలు



ఓదెల: నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి

ఓదెల: మండలంలోని పొత్కపల్లి హైస్కూల్లో కేడీసీసీ బ్యాంకు జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పొత్కపల్లి హైస్కూలు విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో పాటు పెన్నులు పంపిణీ చేశారు. పొత్కపల్లి సొసైటీ ఆళ్ల సుమన్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ కుమారస్వామి, సీఈవో గోళి అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రామగిరి: శాస్త్రసాంకేతిక రంగాలను ఉపయోగించుకుని బ్యాంక్ లావాదేవీలను కొనసాగించాలని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎల్.గాంధీనాయక్ అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. హెచ్‌ఎం రాంకిషన్‌రావు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సాగర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.